ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక



పాఠకులు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు

దీపావళి శుభాకాంక్షలు

పండుగ సందర్భంగా నేడు సెలవు.
సోమవారం సంచిక వెలువడదు.
పున:దర్శనం మంగళవారం.

- ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

సంపుటి: 4 | సంచిక: 212 | పేజీలు: 5 | వెల: రూ.3/- | ఆదివారం 8 నవంబర్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

ప్రాజెక్టుల్లో నీళ్లన్నీ తాగేందుకే..

రైతులకు సీఎం రేవంత్ కీలక హెచ్చరిక!... సంక్రాంతి తర్వాత అన్ని జిల్లాల్లో పర్యటిస్తానన్న సీఎం రేవంత్


ఎల్‌నినోతో వర్షాభావ పరిస్థితులుంటాయని ప్రజలకు అప్రమత్తం.. ప్రాజెక్టుల్లోని నీళ్లు తాగునీటికే సరిపోతాయని స్పష్టీకరణ

రైతులు ఆరుతడి పంటలే సాగు చేయాలని సూచన.. గడ్డం పెంచుకున్నంత మాత్రాన తనలా మారలేరంటూ కేటీఆర్‌పై విమర్శలు

హైదరాబాద్, నవంబర్ 7 (ప్రభాత ఉదయం)

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యే అవకాశముందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రాజెక్టుల్లో ప్రస్తుతం ఉన్న నీళ్లు తాగునీటి అవసరాలకే సరిపోతాయని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, రైతులు ఆరుతడి పంటలే సాగు చేయాలని సూచించారు. ఎల్‌నినోపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారాన్ని నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. కష్టకాలంలో ప్రజలకు అండగా ఉండాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అందరం కలిసికట్టుగా పరిస్థితులను ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. సంక్రాంతి తర్వాత రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటిస్తానని సీఎం ప్రకటించారు. మూడు రోజుల కొడంగల్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా శనివారం హకీంపేట, దుద్యాల మండలాల్లో రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను





ప్రారంభించారు. పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. హకీంపేటలో నిర్మిస్తున్న ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో బీఆర్ఎస్ నేతలపై విమర్శలు గుప్పించారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం ఉంటే తెలంగాణలోనే కరవు వచ్చినట్లు బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని రేవంత్ విమర్శించారు. బావబామ్మర్దులు ఊళ్లపై పడి అబద్ధాలు చెబుతారని, వారి మాటలు విని రైతులు నష్టపోవద్దని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరి వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల జోలికి వెళ్లకుండా ఆరుతడి పంటలు సాగు చేయాలని కోరారు. మేడిగడ్డ నుంచి నీళ్లు ఎత్తిపోసుకోకపోవడం వల్లే ఆంధ్రప్రదేశ్‌కు నీళ్లు వెళ్తున్నాయన్న బీఆర్ఎస్ ఆరోపణల్లో నిజం లేదని సీఎం అన్నారు. మేడిగడ్డ బ్యారేజీలో 16 టీఎంసీల నీరు ఉంటేనే కన్నెపల్లి నుంచి ఎత్తిపోసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లు దించే పరిస్థితి కూడా లేదన్నారు. బీఆర్ఎస్ అవినీతి వల్లే ఈ మూడు బ్యారేజీలు పనిచేయడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన దేవాదుల, వైఎస్సార్ ప్రారంభించిన ప్రాజెక్టులే ప్రస్తుతం రైతులకు, ఖమ్మం జిల్లాకు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. పాలమూరు నుంచి గెలిచిన కేసీఆర్ భారీ బడ్జెట్ ఖర్చు చేసినా అక్కడి ప్రాజెక్టులను పూర్తి చేయలేదని రేవంత్ విమర్శించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టి పేరు, స్థలం, అంచనాలు మార్చి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్ పాలనలోనే కూలిపోయిందని ఆరోపించారు. వచ్చే డిసెంబరులో ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలకు స్పీకర్ అనుమతి కోరుతున్నామని, ఆ సమావేశాల్లో ఎల్‌నినో, కాళేశ్వరం అంశాలపై చర్చించేందుకు సిద్ధమని సవాల్ విసిరారు. కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం అంచనాలు పెంచడంపై కేటీఆర్ చేస్తున్న విమర్శలకూ సీఎం సమాధానమిచ్చారు. పదేళ్ల బీఆర్ఎస్ ..మిగతా 2లో



కొడంగల్ టెండర్లలో పొంగులేటి కంపెనీకి లబ్ధి: కేటీఆర్

కొడంగల్ ఎత్తిపోతలలో భారీ అవకతవకలు జరిగాయన్న కేటీఆర్

రూ.1450 కోట్ల నుంచి రూ.6825 కోట్లకు ప్రాజెక్టు వ్యయాన్ని పెంచారని విమర్శ

ఇది క్రోనీ క్యాపిటలిజం, పగటి దోపిడీ అంటూ తీవ్ర విమర్శ

హైదరాబాద్, నవంబర్ 7 (ప్రభాత ఉదయం)

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం టెండర్లలో భారీ అవకతవకలు జరిగాయని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన కంపెనీకి అనుచిత లబ్ధి చేకూర్చారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం 2014లో సుమారు రూ.1,450 కోట్లుగా ఉండగా, దానిని ఇప్పుడు రూ.6,825 కోట్లకు పెంచారని కేటీఆర్ విమర్శించారు. రైతులకు ఇంకా చుక్క నీరు అందకముందే, అంచనా వ్యయాన్ని దాదాపు ఐదు రెట్లు పెంచి రాష్ట్ర సంపదను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. టెండర్ల ప్రక్రియలో మంత్రి పొంగులేటి కంపెనీ ప్రధాన పోటీదారుగా ఉందని, మిగతా కంపెనీలన్నీ నామమాత్రపు పోటీదారులేనని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై కేటీఆర్ తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "క్రోనీ క్యాపిటలిజం, పగటి దోపిడీ అనే పదాలు కూడా ఈ దోపిడీ ముందు చాలా చిన్నవి అయిపోతున్నాయి. రాహుల్ గాంధీ గారూ.. ఈ దోపిడీని వర్ణించడానికి దయచేసి ఏదైనా కొత్త పదాన్ని వెతకడంలో నాకు సహాయం చేయండి" అని అన్నారు. ప్రజల అవసరాలను పక్కనపెట్టి, ప్రాజెక్టుల పేరుతో అంచనాలు పెంచి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు. టెండర్ల ప్రక్రియలో పారదర్శకత లేకుండా, తమకు అనుకూలమైన కంపెనీలకే పనులు కట్టబెట్టేలా కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు.

మహా పాదయాత్రలో పాల్గొంట

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 7 (ప్రభాత ఉదయం):



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ న్యూఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో పార్టీ పరిస్థితి, సంస్థాగత బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై ఇరువురూ చర్చించారు.ఈ క్రమంలో ఛత్ పూజ అనంతరం తప్పకుండా కరీంనగర్‌కు వచ్చి మహా పాదయాత్రలో పాల్గొంటానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ హామీ ఇచ్చారు. అలాగే రాజ్యాంగబద్ధ సంస్థలపై కాంగ్రెస్, ఇండియా కూటమి చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొడుతూ, ఎస్ఐఆర్ విషయంలో వాస్తవాలను ప్రజలకు వివరించేందుకు కరీంనగర్‌లో చేపడుతున్న మహా పాదయాత్ర గురించి బండి సంజయ్ నితిన్ నబిన్‌కు వివరించారు.ఈ నెల 5వ తేదీన కరీంనగర్ రావాల్సి ఉన్నప్పటికీ, ఇతర కార్యక్రమాల్లో బిజీగా ఉండటంతో పర్యటన సాధ్యపడలేదని నితిన్ నబిన్ పేర్కొన్నారు. ఛత్ పూజ అనంతరం కరీంనగర్‌కు వచ్చి మహా పాదయాత్రలో పాల్గొంటానని స్పష్టం చేశారు. కరీంనగర్‌లోని బీజేపీ శ్రేణుల ఉత్సాహాన్ని ప్రత్యక్షంగా చూడాలని ఉందని తెలిపారు.

ఉచిత చీరల పంపిణీ..

హైదరాబాద్‌లో సీఎం చేతుల మీదుగా ప్రారంభం

హైదరాబాద్, నవంబర్ 7 (ప్రభాత ఉదయం)

రాష్ట్రంలో ఇందిరా మహిళాశక్తి పథకం కింద మహిళలకు ఉచిత చీరల పంపిణీ కార్యక్రమం ఈ నెల 19న హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దీనికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, రాజధాని శివార్లలోని మహిళాసంఘాల సభ్యురాళ్లు



హాజరుకానున్నారు. 2026 సంవత్సరానికిగాను రాష్ట్రంలో ఉచిత చీరల పంపిణీ పథకానికి ప్రభుత్వం రూ.334 కోట్లను కేటాయించింది. గతంలో పాలపిట్ట రంగు చీరలు ఉండగా.. ఈసారి ఎరుపు జరీ అంచు గల చిలకపచ్చ రంగును ఎంపిక చేశారు. ఏప్రిల్ నుంచే సిరిసిల్లతో పాటు మరో 13 కేంద్రాల్లో చీరల ఉత్పత్తిని ప్రారంభించారు. మొత్తం 95 లక్షల మందికి పంపిణీ చేయడం లక్ష్యం కాగా ఇప్పటివరకు 65 లక్షల చీరల తయారీ పూర్తయింది. వీటిని ఇప్పటికే జిల్లాలకు చేర్చారు.

సింగరేణి కార్మికులకు శుభవార్త.. మూడేళ్ల నిరీక్షణకు తెర..

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 7 (ప్రభాత ఉదయం):

సింగరేణి కార్మికులు మూడేళ్లుగా ఎదురుచూస్తున్న క్రమబద్ధీకరణకు ఎట్టకేలకు మార్గం సుగమమైంది. పరిశ్రమలో బదిలీ వర్కర్లు, జనరల్ అసిస్టెంట్ ట్రైనీలుగా పనిచేస్తున్న సుమారు 1,135 మందిని జనరల్ అసిస్టెంట్లుగా క్రమబద్ధీకరించేందుకు సింగరేణి యాజమాన్యం శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో అర్హులైన కార్మికులకు ఊరట లభించనుంది. 2025 డిసెంబర్ 31 కంటే ముందు ఉద్యోగంలో చేరి బదిలీ వర్కర్లు లేదా జనరల్ అసిస్టెంట్ ట్రైనీలుగా పనిచేస్తున్న వారికి ఈ అవకాశం ..మిగతా 3లో

17 ఏళ్ల నిరీక్షణకు తెర..

కూకట్‌పల్లి ఫ్లాట్లపై సుప్రీం కీలక ఆదేశాలు

కూకట్‌పల్లి ఫ్లాట్లపై 17 ఏళ్లుగా కొనసాగుతున్న వివాదం

101 మందికి నవంబర్ 23లోగా రిజిస్ట్రేషన్ చేయాలని సుప్రీం ఆదేశం

కొనుగోలుదారులకు అత్యున్నత న్యాయస్థానంలో భారీ ఊరట

14 శాతం వడ్డీ వసూలుపై హైకోర్టుదే తుది నిర్ణయమని స్పష్టీకరణ

కేసు తేలే వరకు ఆస్తులు అమ్మరాదని ఇరువర్గాలకు ఆంక్షలు

హైదరాబాద్, నవంబర్ 7 (ప్రభాత ఉదయం)

కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు ఫేజ్-15లో ఇళ్ల కోసం గత 17 ఏళ్లుగా నిరీక్షిస్తున్న కొనుగోలుదారులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. వివాదంలో ఉన్న 101 ఫ్లాట్లను ఈ నెల 23వ తేదీలోగా కొనుగోలుదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని తెలంగాణ హౌసింగ్ బోర్డును సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అరుణ్ పల్లిలతో కూడిన ధర్మాసనం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. వాయిదాల చెల్లింపుల్లో జాప్యం జరిగిన వారి నుంచి 14 శాతం వడ్డీ వసూలు చేయాలా? వద్దా? అనే అంశాన్ని హైకోర్టు తేల్చే వరకు వేచి చూడాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే, వడ్డీ వివాదం తేలే వరకు కొనుగోలుదారులను ఇబ్బంది పెట్టకూడదని పేర్కొంటూ, తక్షణమే రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించింది. హైకోర్టులో కేసు పరిష్కారమయ్యే వరకు ఈ ఇళ్లను ఇతరులకు విక్రయించడం లేదా



బదిలీ చేయడం వంటి చర్యలు చేపట్టరాదని అటు హౌసింగ్ బోర్డుకు, ఇటు కొనుగోలుదారులకు న్యాయస్థానం ఆంక్షలు విధించింది. 2009లో హౌసింగ్ బోర్డు 'సంపూర్ణం' పథకం కింద కేపీహెచ్‌బీలో ఇళ్లను కేటాయించింది. తొలుత ఫ్లాట్ ధరను రూ.30.80 లక్షలుగా నిర్ణయించి, ఆ తర్వాత దానిని రూ.47.85 లక్షలకు పెంచడంతో వివాదం మొదలైంది.



అర్హులైన ప్రతి పేద కుటుంబానికి

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

నందిగామ మండలంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, నవంబర్ 7 (ప్రభాత ఉదయం)

రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని, పేదల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.శనివారం షాద్‌నగర్ నియోజక వర్గం నందిగామ మండలంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తో కలిసి మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నందిగామ గ్రామంలో ఇద్దరు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని ..మిగతా 2లో

దీపావళి పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలి

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 7 (ప్రభాత ఉదయం):

హిందూ సంప్రదాయాలలో దీపావళి పండుగకు చాలా ప్రత్యేకత ఉందని ఈ పండుగ ద్వారా ప్రతి ఒక్క ఒక్కరి ఇంట్లో ఐశ్వర్యం, ఆరోగ్యం కలుగుతాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి కొత్తపల్లి నిర్వహించిన దీపావళి , మిస్ మ్యాచింగ్ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరై ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దీపాలను వెలిగించి శ్రీ మహాలక్ష్మి మాత చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు కార్యక్రమాన్ని నిర్వహించారు. దీపాల వెలుగులు ప్రతి ఇంట ఆనందాన్ని ప్రతి కుటుంబంలో సంతోషాన్ని ప్రతి ఒక్కరి జీవితంలో నూతన ఆశలను నింపుతుందని



అన్నారు. చాటిచెప్పుతున్నదని పేర్కొన్నా. ఈ దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం , విద్యార్థులు విజయాలు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.వేడుకలలో భాగంగా



విద్యార్థులు ప్రదర్శించినటువంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు చాలా ఆలోచింపచేసాయి అదే విధంగా నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

పాగుంట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న డీఎస్పీ, ఎస్ఐ

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై పోలీసు అధికారుల పరిశీలన

ఈ నెల 10న స్వామివారి రథోత్సవం.. పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచన

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 7(ప్రభాత ఉదయం):

కేటీదొడ్డి మండలం వెంకటాపురం గ్రామంలో వెలసిన ప్రసిద్ధ శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామివారిని శనివారం గద్వాల డీఎస్పీ వై. మొగులయ్య, కేటీదొడ్డి ఎస్ఐ పి. శ్రీనివాసులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం శనివారం నుంచి ప్రారంభం



కానున్న స్వామివారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయ పరిసరాలను, రథోత్సవ నిర్వహణకు సంబంధించిన ప్రాంతాలను పరిశీలించారు. ఈ నెల 10న నిర్వహించనున్న



స్వామివారి రథోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



నగరపాలక సంస్థలో వైభవంగా దీపావళి వేడుకలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 7 (ప్రభాత ఉదయం):

కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో దీపావళి పండుగ వేడుకలు సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శనివారం పండుగను పురస్కరించుకొని కార్యాలయంలో లక్ష్మీపూజ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్, యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు నగర ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రాజెక్టుల్లో నీళ్లన్నీ తాగేందుకే..

మొదటి పేజీ తరువాయి...

పాలనలో కొడంగల్ ప్రాంతానికి ఏం చేశారని ప్రశ్నించారు. గతంలో ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ. 2 లక్షలు ఇచ్చేందుకు కూడా కేసీఆర్ ప్రభుత్వం ముందుకు రాలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం మాత్రం భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.20 లక్షల వరకు పరిహారం ఇస్తోందన్నారు. హైదరాబాద్-లగచర్ల ప్రాంతాన్ని ఢిల్లీ-నోయిడా తరహాలో అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నామని, అక్కడ పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద కంపెనీలు వస్తున్నాయని తెలిపారు. హకీంపేటలో 250 ఎకరాల్లో ఎడ్యుకేషన్ హబ్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. కేటీఆర్ వేషభాషలు మార్చుకున్నా ప్రజలు నమ్మరని రేవంత్ ఎద్దేవా చేశారు. గడ్డం పెంచుకున్నంత మాత్రాన తనలా మారలేరని వ్యాఖ్యానించారు. తాను మూడేళ్లుగా గంట కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నానని చెప్పారు. సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారని, అబద్ధాలు ప్రచారం చేస్తున్న కుటుంబాన్ని ప్రజలు బహిష్కరించాలని పిలుపునిచ్చారు.



అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం

మొదటి పేజీ తరువాయి...

నూతన గృహాలను ప్రారంభించారు.అనంతరం మహిళా సమాఖ్య భవనం, అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. రూ. 2 కోట్ల వ్యయంతో నిర్మించిన పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాన్ని, నందిగామ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని ప్రారంభించారు. అలాగే నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నందిగామ గ్రామంలో హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. పాత జాతీయ రహదారి-7 నుంచి నర్సప్పగూడ గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నందిగామ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోనిప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ, రైతు భరోసా కింద ఎకరాకు రూ. 12 వేల ఆర్థిక సాయం వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. సన్నధాన్యం పండించే రైతులకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు అదనంగా రూ. 500 బోనస్ అందిస్తున్నామని పేర్కొన్నారు.గతంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో పేదలకు ఆశలు కల్పించినప్పటికీ, ఆచరణలో వారికి ఇళ్లు అందలేదని అన్నారు ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు. మొదటి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 4.5 లక్షల ఇళ్లు, రెండో విడతలో మరో 2.5 లక్షల ఇళ్లు మంజూరు చేయడంతో పాటు హైదరాబాద్ నగరానికి లక్ష ఇళ్లు కేటాయించినట్లు వివరించారు. మొత్తం 8 లక్షల ఇళ్ల నిర్మాణానికి సుమారు రూ. 40 వేల కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి విడతలవారీగా ఇళ్లు మంజూరు చేస్తామని, కులం, మతం, రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన ఆర్థిక సహాయాన్ని ఎలాంటి అవినీతి, లంచాలకు తావులేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రోత్సహించేందుకు 'ఈ దీపావళి మా



దీపావళి' కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజులపాటు గృహప్రవేశాలు, నూతన గృహాల ఫొటోల అప్‌లోడ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 2,25,100 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని వెల్లడించారు.మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఇప్పటివరకు సుమారు రూ.73 వేల కోట్ల రుణాలను సున్నా వడ్డీపై అందించినట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు అమలు చేసిన మంచి సంక్షేమ పథకాలైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలను కూడ కొనసాగిస్తున్నామని వివరించారు.రాష్ట్రంలో భూ సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. ప్రతి భూమి పార్సిల్‌కు ఆధార్ తరహాలో ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయించనున్నట్లు చెప్పారు. మొదటి విడతలో ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాల్లో సమగ్ర భూ సర్వే చేపడుతున్నామని, రాబోయే ఏడాదిన్నరలో రాష్ట్రంలోని మొత్తం 10,456 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సర్వే అనంతరం ప్రతి భూమికి క్యూఆర్ కోడ్‌తో కూడిన మ్యాప్, భూధార్ నంబర్‌తో పాస్‌బుక్ అందజేస్తామని పేర్కొన్నారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.షాద్‌నగర్ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో వెంకిరాల గ్రామంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించి అర్హులైన వారికి పట్టాదారు పాస్‌బుక్కులు అందించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మిగిలిన గ్రామాల్లో కూడా భూ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.సిద్దాపురం ప్రాంతంలో



ప్రతిపాదించిన డంపింగ్ యార్డు కారణంగా స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఎమ్మెల్యే తన దృష్టికి తీసుకువచ్చారని మంత్రి తెలిపారు. ప్రజల అభిప్రాయాలను, ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని సిద్దాపురంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయకుండా ప్రత్యామ్నాయ స్థలాన్ని పరిశీలించాలని అధికారులను ఇప్పటికే ఆదేశించినట్లు స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం తీసుకోదని, ప్రజా ప్రయోజనాలే ప్రభుత్వానికి ముఖ్యమని పేర్కొన్నారు.షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నిరంతరం కృషి చేస్తున్నారని మంత్రి ప్రశంసించారు. నియోజకవర్గం లోని సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల మంజూరు విషయంలో ఎమ్మెల్యే పట్టుదలతో వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఆయన విజ్ఞప్తి మేరకు నందిగామ ప్రాంత ప్రజల సౌకర్యార్థం మండలంలో ఎంఆర్ఓ కార్యాలయం (తహసీల్దార్ కార్యాలయం), ఆర్డీఓ కార్యాలయాల ఏర్పాటుకు ఈ సందర్భంగా మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.ప్రజల అవసరాలు, సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రతి నిర్ణయం తీసుకుంటుందని, ప్రజలకు మేలు చేసే కార్యక్రమాల అమలులో ఎలాంటి రాజీ ఉండదని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని క్రమంగా మెరుగుపరుస్తూ, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా నెరవేరుస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రారెడ్డి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కె.కిరణ్మయి, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, ఆర్డీఓ సరిత, పీడీ హౌసింగ్ చంప్లా నాయక్, పిడి డిఆర్డిఏ శ్రీలత, ఇతర జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, సంబంధిత శాఖల అధికారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



పేద విద్యార్థులకు కేంద్ర మంత్రి బండి భరోసా!

10,959 మంది చదువుకునేందుకు తోడ్పాటు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 7 (ప్రభాత ఉదయం):

పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదు.. ఆర్థిక ఇబ్బందులతో ఏ విద్యార్థీ పరీక్షలకు దూరం కాకూడదనే సంకల్పంతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పెద్ద మనసు చాటుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న పేద విద్యార్థుల పరీక్ష ఫీజును తన సొంత ఖర్చులతో చెల్లించి అండగా నిలిచారు.కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఐదు జిల్లాలకు చెందిన ఏకంగా 10,959 మంది విద్యార్థులకు ఈ సహాయం అందించారు.ఈ మేరకు శనివారం ఐదు జిల్లాల కలెక్టర్లకు బీజేపీ ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో పరీక్ష ఫీజులకు సంబంధించిన చెక్కులను అందజేశారు. జిల్లాల వారీగా కరీంనగర్‌లో 4,356 మంది విద్యార్థులకు రూ.5,44,500, రాజన్న సిరిసిల్లలో 3,920 మందికి రూ.4,90,000, సిద్దిపేటలో 1,133 మందికి రూ.1,37,140, జగిత్యాలలో 1,087 మందికి రూ.1,35,875, హనుమకొండలో 463 మందికి రూ.57,875 చొప్పున ఆర్థిక సహాయం అందించారు.

పదోన్నతి బాధ్యతను మరింత పెంచుతుంది: జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 7(ప్రభాత ఉదయం):



ప్రమోషన్ పోలీస్ సేవలలో బాధ్యతను మరింత పెంచడం తో పాటు చేసే పనిలో ఉత్సాహాన్ని కలిగిస్తుందని తద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు అన్నారు. మల్దకల్ పోలీస్ స్టేషన్ లో ఏఎస్ఐ విధులు నిర్వహిస్తున్న జి. ఈశ్వరయ్య ప్రమోషన్ ఎస్సై గా పదోన్నతి పొందిన సందర్భంగా ఆయన శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు, మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్వయంగా పదోన్నతి పొందిన అధికారికి స్టార్స్ తొడిగి, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ --- ఉద్యోగ జీవితంలో పదోన్నతి అనేది కేవలం పదవిలో ఎదుగుదల మాత్రమే కాకుండా, బాధ్యతలు మరింతగా పెరిగే దశగా భావించాలి అని అన్నారు. పదోన్నతి ద్వారా వ్యక్తిలో కొత్త ఉత్సాహం, మరింత నిబద్ధత, సేవాభావం పెరగాలని ఆయన సూచించారు.అదేవిధంగా, విధులను నిర్వర్తించే సమయంలో ఆరోగ్యాన్ని కూడా సమానంగా కాపాడుకోవాలని, శారీరక , మానసికంగా దృఢంగా ఉండటం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమని ఆయన వివరించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ప్రతి పోలీసు అధికారి బాధ్యత అని పేర్కొన్నారు.



ఓటు హక్కుకు ముప్పు కలిగించే చర్యలను అరికట్టాలి: సీపీఐ నేత బాల నరసింహ

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 7(ప్రభాత ఉదయం):

కరువుతో పంటలు నష్టపోయిన రైతులు, వ్యవసాయ కూలీలు, పేద ప్రజలను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పరిహార ప్యాకేజీ ప్రకటించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం. బాల నరసింహ డిమాండ్ చేశారు. శనివారం గద్వాలలో జరిగిన సీపీఐ జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓట్ల చోరీ ఆరోపణలు, ఎస్ఐఆర్ ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపించి అర్హుల ఓటు హక్కును కాపాడాలని కోరారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రజాస్వామ్య హక్కు అన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని సమావేశం నిర్ణయించింది. ఈ నెల 10న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాలో రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు పిలుపునిచ్చారు.



సొంతింట్లో తొలి దీపావళి.. ఇందిరమ్మ కుటుంబాల్లో పండుగ వెలుగులు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 7 (ప్రభాత ఉదయం):

సొంతింటి కల నెరవేరి.. కొత్త ఇంట్లో తొలి దీపావళి జరుపుకుంటున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాల్లో పండుగ వెలుగులు నింపేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని ప్రతి లబ్ధిదారుడి ఇంట్లో పండుగ సంబరాలు వెల్లివిరిసేలా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. శనివారం ఐడీఓసీలో కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్.. ప్రజాప్రతినిధులు, అధికారులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి కుటుంబాలతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొనాలని సూచించారు. పేద కుటుంబాల సొంతింటి కల సాకారమైన వేళ వారి తొలి పండుగను మరింత ప్రత్యేకంగా మార్చేలా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం నింపేలా అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి స్వామి, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై లైంగిక వేదింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న

వ్యవసాయ వర్శిటీ వీసీని పదవి నుంచి తప్పించి న్యాయ విచారణ జరపాలి

స్వ లాభం - స్వ కాంక్ష కోసమే వీసీ పనిచేస్తున్నారు వర్సిటీ అభివృద్ధి కోసం కాదు

మాట వినని వారిని ట్రాన్స్ ఫర్ లు చేస్తు భయపెడుతున్నారు.. ఆయన హయాంలో జరిగిన నిర్ణయాలు, ఖర్చు చేసిన నిధులపై విచారణ జరపాలి

రాజేంద్రనగర్, నవంబరు 7 (ప్రభాత ఉదయం)

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మహిళ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తేజ శ్రీ పై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ను ఆ పదవి నుంచి తప్పించి నిష్పాక్షపాతంగా విచారణ జరు పాలని వర్శిటీ టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగ సంఘాల నాయకులతో పాటు పీహెచ్ స్కాలర్స్, విద్యార్థులు డిమాండ్ చేశారు. శనివారం రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆవరణలోని ప్రొఫెసర్ జయశంకర్ సార్ ప్రాంగణం వద్ద బాధితురాలు తేజ శ్రీ తో కలసి నిరసన లో పాల్గొన్నారు. ఈ సందర్భం గా తెలంగాణ అగ్రికల్చరల్ సైంటిస్ట్ అసోసియేషన్ (టాసా) రాష్ట్ర అధ్యక్షలు డాక్టర్ కె పవన్ చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సల్లా సౌజన్య, ఉపాధ్యక్షులు డాక్టర్ జె కమలాకర్, ఆల్ యూనివర్శిటీస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షులు సామ అమృత్ రెడ్డి, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ వర్శిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్ జయరాం, పీ హెచ్ డీ స్కాలర్ రాజ్ కుమార్ లు మాట్లాడారు. 2026 జనవరి 4వ తేదీ నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న తేజశ్రీ ని వర్శిటీ కి వైస్ చాన్సలర్ గా ఉన్న ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ద్వందార్థలతో మాట్లాడుతూ, లైంగికంగా వేదిస్తున్నాడని తమకు ఫిర్యాదు అందిందన్నారు. వైస్ చాన్సలర్ మహిళ అసిస్టెంట్ ప్రొఫెసర్ ను వేదిస్తున్నాడని ఫిర్యాదు వచ్చిందంటే అది విశ్వవిద్యాలయానికి చెడ్డపేరు అని గుర్తు చేశారు. దీనిపై వైస్ చాన్సలర్ ను ఆ పదవి నుంచి తప్పించి విచారణ అనంతరం చర్యలు తీసుకోవాలన్నారు. విచారణలో వైస్ చాన్సలర్ తప్పు లేకుంటే తిరిగి పదవి ఇవ్వాలన్నారు. ప్రజా పాలన అంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే ఈ సంఘటన పై విచారణ కు ఆదేశించాలన్నారు. వర్శిటీ లో పరిశోధనలు లేవని, తనకు అనుకూలంగా లేని వారిని ట్రాన్స్ ఫర్ లు చేసుకుంటు వైస్ చాన్సలర్ ఇష్టానుసారంగా వ్యవహతీస్తున్నారన్నారు. పని చేసే వారు మాకు వద్దు.. కో ఆపరేట్ చేసే వారే కావాలంటు వైస్ చాన్సలర్ అంటుంటారని వాపోయారు. వైస్ చాన్సలర్ కొందరు అసిస్టెంట్ ప్రొఫెసర్ లను కొటారీ గా ఏర్పరుచుకొని వారి చేత తేజశ్రీ ని ఫిర్యాదు ఉప సంహరించుకోవాలని ఒత్తిడి తీసుకువస్తున్నారన్నారు. తేజ శ్రీ తనకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తు ఉమెన్ సేఫ్టీ వింగ్, డీజీపీ కి ఫిర్యాదు చేసిందని, అయినా స్పందన లేకుండ వర్శిటీ చాన్సలర్ గా ఉన్న తెలంగాణ రాష్ట్ర గవర్నర్ కు ఫిర్యాదు చేసిందన్నారు. వర్శిటీ 70 శాతం విద్యార్థినీలే ఉన్నారని, మహిళలను వేదించే



రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆవరణలోని ప్రొఫెసర్ జయశంకర్ సార్ ప్రాంగణం వద్ద నిరసన తెలుపుతున్న బాధితురాలు డాక్టర్ తేజ శ్రీ, ఉపాధ్యాయ, ఉద్యోగ, విద్యార్థి సంఘాల నాయకులు

అలవాట్లు ఉన్న వైస్ చాన్సలర్ ఉంటే వారికి ఎలా భద్రత లభిస్తుందన్నారు. విశ్వవిద్యాలయాలు అంటే సరస్వతీ నిలయాలని, ఆ సరస్వతీ నిలయాలలో మహిళలను వేదించడమేమిటని ప్రశ్నించారు. అనంతరం రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల నుంచి వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనం వరకు వైస్ చాన్సలర్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తు ర్యాలీ నిర్వహించారు. పరిపాలన భవనం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సోమవారం లోపు వైస్ చాన్సలర్ పై విచారణ చేపడతామని ప్రభుత్వం హామీ ఇవ్వకపోతే సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తం గా వ్యవసాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ లో పనిచేస్తున్న శాస్త్రవేత్తలు, ఉద్యోగులు, విద్యార్థుల తో కలసి నిరసన కార్యక్రమాలను ఉధృతం చేయనున్నట్లు ప్రకటించారు.

కృషి స్కూల్ ను ప్రైవేటు వ్యక్తులకు ఎలా కట్టబెడుతారు : ఆల్ యూనివర్సిటీస్ జాతీయ ఉపాధ్యక్షులు సామ అమృత్ రెడ్డి:

వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణలో ఉన్న కృషి హై స్కూల్ వర్సిటీ లో పని చేసే వారి పిల్లలకోసం ఏర్పాటు చేసిందని ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షులు సామ అమృత్ రెడ్డి అన్నారు. ఆ స్కూల్ ను వైస్ ఛాన్సలర్ తనకు తెలిసిన వారికి ఎలాంటి నిబంధనలు పాటించకుండా అప్పగించారని , ఇది ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. వర్సిటీ లో చాలా సంవత్సరాలుగా పొదుపు చేసి ఫిక్స్ చేసిన నిధులను ఇష్టానుసారంగా ఖర్చు చేయడం ఏంటని ప్రశ్నించారు. నెల కొక సారి ఉద్యోగులను, ఉపాధ్యాయులను, శాస్త్రవేత్తలను ట్రాన్స్ ఫర్ చేస్తున్నారని, ఇది వర్సిటీ కి మంచిది కాదన్నారు.

మధ్య వర్తిత్వం వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి : డాక్టర్ సల్లా సౌజన్య :

మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తేజ శ్రీ కి జరిగిన అన్యాయం గురించి ఆమె వివిధ సంస్థలకు ఫిర్యాదు చేయగా, వాటిని ఉప సంహరించుకోవాలని వర్సిటీ కి చెందిన కొందరు అసిస్టెంట్ ప్రొఫెసర్ లు రాజీ కుదర్చడానికి ప్రయత్నిస్తున్నారని, వారిపై కూడా కేసులు నమోదు చేయాలని తెలంగాణ అగ్రికల్చర్ సైంటిస్ట్ అసోసియేషన్ (టాసా) ప్రధాన కార్యదర్శి డాక్టర్ సల్లా సౌజన్య డిమాండ్ చేశారు. ఒక మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్ కు అన్యాయం జరిగితే ఆమె వైపు ఉండాలి కాని, ఆమె ను బెదిరించే విధంగా మాట్లాడటం మంచిది కాదన్నారు.

పటిష్ట బందోబస్తు:

వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య రాజీనామా చేయాలని, ఆయన ద్వారా ఇబ్బందులకు గురైన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తేజ శ్రీ కి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ లో శనివారం జరిగిన నిరసన నేపద్యం లో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇన్స్ పెక్టర్ ఆర్ వెంకటేష్, డీ ఐ విజయ మోహన్, ఎస్ ఐ రాజ్ కుమార్, ఏ ఎస్ ఐ మహాలక్ష్మి లు సిబ్బంది తో కలసి బందోబస్తు నిర్వహించారు.

సంఘటనపై ఇంటిలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసుల ఆరా :

మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తేజ శ్రీ తనను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య లైంగికంగా వేధించాడని ఆరోపించడం, రాత్రి వేళలలో వాట్సాప్ ద్వారా మాట్లాడటం, తన ఛాంబర్ లో అసభ్యంగా మాట్లాడటం ను బట్టి ఆమె ఉమెన్ సేఫ్టీ వింగ్, డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. వర్సిటీ ఛాన్సలర్, గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా కు ఫిర్యాదు చేసింది. శనివారం ఆమె స్వయంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం లోకి వచ్చి వీసీ తనను వేధించాడని మీడియా ముందు చెప్పుకుంది. దీంతో ఇంటెలిజెన్స్ పోలీసులు, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఈ సంఘటన పై బాధిత మహిళ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందచేసి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళారు.

వర్శిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అసోసియేట్ అధ్యక్షులు ఎం రాజు, సంయుక్త కార్యదర్శి జి పరమేశ్, టెక్నికల్ కార్యదర్శి సులోచన, టాసా సంయుక్త కార్యదర్శి డాక్టర్ రమేష్ , ప్రొఫెసర్ త్రివేణి, ఉద్యోగ సంఘాల నాయకులు ప్రవీణ్ కుమార్, సత్యనారాయణ, ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ ఆసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ మనోజ్ కుమార్, భరత్ భూషణ్ తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ కళాశాల నుంచి వర్సిటీ పరిపాలన భవనం వరకు ర్యాలీ నిర్వహించిన ఉపాధ్యాయ, ఉద్యోగ, విద్యార్థి సంఘాల నాయకులు



వ్యవసాయ వర్సిటీ పరిపాలన భవనం వద్ద నిరసన తెలుపుతున్న టాసా ప్రతినిధులు, వర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు



వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనం వద్ద బైఠాయించిన బాధితురాలు



కాంట్రాక్టర్లతో సమావేశమైన రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

సీసీ రోడ్ల క్యూరింగ్ కోసం గ్రీన్ వాటర్ ట్యాంకర్లనే ఉపయోగించాలి:

రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

బుద్వేల్, నవంబరు 7 (ప్రభాత ఉదయం)

రాజేంద్రనగర్ జోన్ పరిధిలో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణం పనులు, క్యూరింగ్ కోసం సివరేజి ట్రీట్మెంట్ ప్లాంట్ల ద్వారా శుద్ధి చేస్తున్న గ్రీన్ వాటర్ ట్యాం కర్ల నీటినే వాడాలని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి కోరారు. బుద్వేల్ లో గల జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ జోనల్ కార్యాలయంలో శనివారం జోన్ స్థాయి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఎల్లినో నేపథ్యంలో బోరు నీటిని గానీ, మంచినీటి ని గాని సీసీ రోడ్ల క్యూరింగ్ కోసం వాడవద్దన్నారు. నీటి కొరత నేపద్యంలో భూ గర్భ జలాల పరిరక్షణ కోసం అందరం కలసి కట్టుగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. గ్రీన్ వాటర్ ట్యాంకర్ల కోసం మీర్ ఆలం, అత్తాపూర్, నూర్ మహ్మద్ కుంటతో పాటు 216 పిల్లర్ సమీపంలో ఉన్న ట్రీట్మెంట్ ప్లాంట్ల నుంచి శుద్ధి చేయబడిన గ్రీన్ వాటర్ ట్యాంకర్లను మాత్రమే వాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంట్రాక్టర్లు మాట్లాడుతూ, గ్రీన్ ట్యాంకర్లు కావాల్సినన్ని అందుబాటు లో ఉంటాయా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జోన్ ఎస్ఈ నరేందర్ గౌడ్, కాంట్రాక్టర్ అసోసియేషన్ ప్రతినిధులు హనుమంత్ సాగర్, గౌతమ్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.



నర్సాబాయి కుంట సుందరీ కరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ ప్రకాష్ గౌడ్

కాటేదాన్, మైలార్దేవుపల్లి డివిజన్లలో రూ.3.50 కోట్లతో అభివృద్ధి పనులు


బుద్వేల్, నవంబరు 7 (ప్రభాత ఉదయం):

కాటేదాన్, మైలార్దేవుపల్లి డివిజన్ల పరిధిలో రూ. 3.50 కోట్ల తో చేపట్టనున్న అభివృద్ధి పనులకు, చెరువుల సుందరీకరణ పనులకు శనివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ అత్తాపూర్ సర్కిల్ ఈఈ వెంకట శేషయ్య తో కలసి శంకుస్థాపన లు చేశారు. వాటిలో మార్కండేయనగర్ లోని నర్సభాయి కుంట ను రూ.1.79 కోట్లతో అభివృద్ధి చేసి సుందరీకరణ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. మార్కండేయనగర్, దుర్గానగర్ ప్రాంతాలలో ఐదు రోడ్లను మిగతా మొత్తంతో వేయనున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో పనులు చేపడుతున్నామన్నారు. నర్సభాయికుంట సుందరీకరణ తో మార్కండేయనగర్, బాబుల్ రెడ్డినగర్, వెంకటేశ్వర కాలనీ, సాయిబాబానగర్ కాలనీల ప్రజలకు ఎంతో బాగుంటుందన్నారు. రోడ్ల పనులు పూర యితే ఈ ప్రాంతం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సోమ శ్రీనివాస్ గుప్తా, యువజన కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు సోమ సందీప్ గుప్తా, కాళీదాసు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ వర్శిటీలో ఎన్ఆర్ఐ కోటా సీట్లను తగ్గించి, కన్వీనర్ కోటా సీట్లు పెంచాలి

బుద్వేల్, నవంబరు 7 (ప్రభాత ఉదయం)

రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం లో రెగ్యులర్ కోటా సీట్లను తగ్గిస్తు స్పెషల్ కోటా సీట్లను పెంచడంపై విద్యార్థులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. వారికి మద్దతుగా బీఆర్ఎస్వి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ కౌన్సిలింగ్ కేంద్రమైన ఎగ్జామినేషన్ సెంటర్ వద్దకు చేరుకుని నిరసన కు దిగారు. స్పెషల్ కోటా ను సీట్లను తగ్గించి రెగ్యులర్ కోటా సీట్లను పెంచాలని డిమాండ్ చేశారు. ఒక్క సెమిస్టర్ కు రూ.1.12.790 లు వసూలు చేస్తున్నారని



వ్యవసాయ విశ్వవిద్యాలయం పరీక్షా కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

వాపోయారు. భారీగా ఉన్న ఫీజులను తగ్గించాలన్నారు. సెమిస్టర్ ఫీజు తో పాటు అదనంగా మెస్, హస్టల్, పుస్తకాల ఖర్చుతో విద్యార్థులపై ఆర్థిక భారం పడుతు ందన్నారు. ఎపిసెట్, అగ్రికల్చర్ సెట్ ద్వారా అడ్మిషన్లలో రెగ్యులర్ కోటా సీట్లను పెంచాలని డిమాండ్ చేశారు. 580 మంది పాలిటెక్నిక్ విద్యార్థులకు కేవలం 25 సీట్లను జనరల్ కోటా లో కేటాయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మిగిలిన సీట్లన్ని స్పెషల్ కోటాలోనే కేటాయిస్తున్నారని విద్యార్థులు బిఆవేధన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పాలిటెక్నిక్ విద్యార్థులకు కనీసం 15శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.



గంజాయి సాగు కలకలం..

నాలుగు మొక్కలు స్వాధీనం

రైతుపై కేసు నమోదు.. పోలీసుల ఆకస్మిక తనిఖీల్లో వెలుగులోకి

గద్వాల జిల్లా ప్రతినిధి,నవంబర్ 7 (ప్రభాత ఉదయం)

గట్టు మండలం బోయలగుడెం గ్రామ శివారులో అక్రమ గంజాయి సాగు వెలుగుచూసింది. శనివారం బోయలగూడెం గ్రామ శివారులో లో గల లింగపురం గ్రామానికి చెందిన రైతు గోవిందు పొలంలో ఎస్ఐ కళ్యాణ్ కుమార్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పొలంలో సాగు చేస్తున్న నాలుగు గంజాయి మొక్కలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సదరు రైతుపై కేసు నమోదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు గట్టు ఎస్సై కళ్యాణ్ కుమార్ తెలిపారు. మండలంలో ఎవరైనా గంజాయి సాగు లేదా ఇతర అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

జాంపల్లి పాఠశాలలో ఉత్సాహంగా ముందస్తు దీపావళి వేడుకలు...

ధరూర్ , నవంబర్ 7 (ప్రభాత ఉదయం)



ధరూర్ మండల పరిధిలోని జాంపల్లి మండల పరిషత్ పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు పి. రేవతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని పండుగ వాతావరణం ఉట్టిపడేలా అలంకరించారు.విద్యార్థులకు దీపావళి పండుగ విశిష్టత,ప్రాముఖ్యతను వివరించారు.దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని,విద్యార్థులందరూ ఆనందంగా,సురక్షితంగా పండుగ జరుపుకోవాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

క్రాస్ కంట్రీ పరుగులో ఎం.ఎల్.డి. కళాశాల విద్యార్థికి ప్రథమ స్థానం

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 7(ప్రభాత ఉదయం):



పాలమూరులో నిర్వహించిన ఇంటర్ యూనివర్సిటీ సౌత్ జోన్ క్రాస్ కంట్రీ పోటీల్లో ఎం.ఎల్.డి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎన్. అశోక్ 10 కిలోమీటర్ల పరుగుపందెంలో ప్రథమ స్థానం సాధించాడు. దీంతో కర్ణాటకలోని మంగళూరు విశ్వవిద్యాలయంలో జరగనున్న తదుపరి స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్. కలందర్ బాషా, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. కరుణాకర్ రెడ్డి, అధ్యాపకులు అశోక్‌ను అభినందించారు.



జాతీయ అండర్-19 క్రికెట్ జట్టుకు ఎంపికైన గద్వాల విద్యార్థి

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 7(ప్రభాత ఉదయం):

గద్వాలలోని శ్రీ వాగ్దేవి జూనియర్ కళాశాలకు చెందిన ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి పూరి సిద్ధార్థ జాతీయ అండర్-19 క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. తెలంగాణ జట్టు తరపున మధ్యప్రదేశ్‌లో జరిగే పోటీల్లో ఆల్‌రౌండర్‌గా ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి ఎం. హృదయ రాజ్ సిద్ధార్థను శనివారం ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ మహేందర్, ప్రిన్సిపాల్ అనూష, అధ్యాపకులు కేకే రెడ్డి, ఎం. సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు శుభవార్త.. మూడేళ్ల నిరీక్షణకు తెర..

మొదటి పేజీ తరువాయి...

వర్తించనుంది. అయితే గతంలో ఏ సంవత్సరంలోనైనా భూగర్భ విభాగంలో పనిచేసిన వారు కనీసం 190 పని దినాలు, ఓపెన్‌కాస్ట్ గనులు లేదా ఇతర బయటి విభాగాల్లో పనిచేసిన వారు 240 పని దినాలు పూర్తి చేసి ఉండాలి. ఈ అర్హతలు కలిగిన వారినే క్రమబద్ధీకరణకు పరిగణనలోకి తీసుకోనున్నారు.ప్రతి ఏరియాలో పనిచేస్తున్న అర్హులైన కార్మికుల జాబితాలను ఈ నెల 23వ తేదీలోగా సమర్పించాలని యాజమాన్యం ఏరియా జనరల్ మేనేజర్లను ఆదేశించింది. అర్హులుగా గుర్తించిన ఉద్యోగులకు 2026 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి క్రమబద్ధీకరణ వర్తించనుంది.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

ఎల్‌నినో ప్రభావంపై రైతులు అప్రమత్తంగా ఉండి

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లా అదనపు కలెక్టర్ బి. నర్సింగ రావు

పింఛన్ల వెరిఫికేషన్ పారదర్శకంగా,క్షేత్రస్థాయిలో సమగ్రంగా నిర్వహించాలి

సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత,అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలి

జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 7(ప్రభాత ఉదయం):





జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పింఛన్లు పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని అదనపు కలెక్టర్ బి.నర్సింగ రావు అధికారులను ఆదేశించారు.శనివారం అదనపు కలెక్టర్ ధరూర్ మండల పరిధిలోని నీలహళ్లి, నాగర్ దొడ్డి,నెట్టెంపాడు, ధ్యాగదొడ్డి, మాన్ దొడ్డి,చిన్నిపాడు గ్రామాల్లో పర్యటించి జిల్లా స్థాయి పింఛన్ల వెరిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పింఛన్లకు సంబంధించిన వివరాలు, లబ్ధిదారుల అర్హతలు,క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్న రికార్డులను పరిశీలించారు.ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి లబ్ధిదారుని వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని, పరిశీలనలో గుర్తించిన అంశాలను నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అనంతరం గ్రామాల్లో అమలవుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను నిర్దిష్ట లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని అన్నారు.ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన అదనపు కలెక్టర్ ఎల్‌నినో ప్రభావం,దాని కారణంగా వాతావరణ పరిస్థితుల్లో చోటుచేసుకునే మార్పులు, వ్యవసాయ రంగంపై పడే ప్రభావాల గురించి వివరించారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు పంటల సాగు, నీటి వినియోగం, ఇతర వ్యవసాయ కార్యకలాపాల్లో తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. వాతావరణ మార్పుల వల్ల పంటలకు నష్టం వాటిల్లకుండా అప్రమత్తంగా ఉండాలని, వ్యవసాయ శాఖ అందించే సాంకేతిక సలహాలు, సూచనలను పాటించాలని తెలిపారు. అనంతరం గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులను అదనపు కలెక్టర్ పరిశీలించారు. పనుల పురోగతి, కూలీల హాజరు, పని ప్రదేశాల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, పనుల నాణ్యతను సమీక్షించారు. ఉపాధి హామీ పనులను నిర్దేశిత ప్రమాణాల ప్రకారం నాణ్యతతో చేపట్టాలని, కూలీలకు సకాలంలో పని కల్పించి అవసరమైన సౌకర్యాలు అందించాలని అధికారులకు సూచించారు. అలాగే గ్రామాల్లో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, ప్రజలకు ప్రభుత్వ సేవలు సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది,రైతులు,తదితరులు పాల్గొన్నారు.



శ్రీ లక్ష్మీదేవి అమ్మ వారి ఆశీస్సులతో ప్రజల సుఖ సంతోషాలతో ఉండాలి

ఎస్ ఈ ఎస్ రమేష్

హైదరాబాద్, నవంబర్ 7(ప్రభాత ఉదయం)

విద్యుత్ సెంట్రల్ సర్కిల్ కార్యాలయంలో దీపావళి పండుగ సందర్భంగా శ్రీ లక్ష్మీదేవి పూజలు శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సర్కిల్ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ గోపికృష్ణ, అకౌంట్స్ ఆఫీసర్ శ్రీకాంత్ నేతృత్వంలో జరిగిన పూజలో సర్కిల్ ఎస్ ఇ ఎస్ రమేష్, సౌత్ విద్యుత్ సర్కిల్ ఎస్ ఇ టి శ్రీనివాస్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ చంద్రుడు, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ శంకర్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు నిరంజన్, అసిస్టెంట్ ఇంజనీర్ సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



మృత్యువుతో పోరాడి.. మళ్లీ కిడ్నీల పనితీరు సాధారణ స్థితికి!

రెండు కిడ్నీలు దెబ్బతిని అపస్మారక స్థితిలో వచ్చిన వ్యక్తికి లిమ్స్ వైద్యుల చికిత్సతో పునర్జన్మ

సరైన సమయంలో వైద్యం తీసుకుంటే డయాలసిస్ అవసరాన్ని నివారించే అవకాశం:డాక్టర్ విజయేందర్ యురళజిస్ట్

శంషాబాద్, నవంబర్ 7 (ప్రభాత ఉదయం)

రెండు కిడ్నీలు పనిచేయక అపస్మారక స్థితిలో ఆసుపత్రికి చేరుకున్న 60 ఏళ్ల వ్యక్తికి మెరుగైన వైద్య చికిత్స అందించి తిరిగి ఆరోగ్యవంతుడిగా ఇంటికి పంపించారు శంషాబాద్ తొండుపల్లిలోని లిమ్స్ కార్డియాక్ అండ్ న్యూరో ఆసుపత్రి వైద్యులు.షాద్‌నగర్‌కు చెందిన అంజయ్య(60) అనే వ్యక్తి కిడ్నీ సమస్యతో ప్రాణాపాయ స్థితిలో తొండుపల్లి న్యూరో డకార్డియాక్ ఆసుపత్రికి చేరుకోగా,వైద్యులుడాక్టర్ విజయేందర్ యురళజిస్ట్ బృందం ప్రత్యేక శ్రద్ధతో చికిత్స అందించి కిడ్నీల పనితీరు తిరిగి మెరుగుపడేలా చేశారు.వివరాల్లోకి వెళితే.షాద్‌నగర్‌కు చెందిన అంజయ్య (60) సుమారు 25 రోజుల క్రితం రెండు కిడ్నీలు దెబ్బతినడంతో స్థానికంగా పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందారు.అయినప్పటికీ ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో అపస్మారక స్థితిలో తొండుపల్లిలోని లిమ్స్ న్యూరోడ కార్డియాక్ ఆసుపత్రికి తరలించారు.అక్కడ డాక్టర్ విజయేందర్ యురళజిస్ట్ సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించగా,ఒక కిడ్నీలో రాళ్లు ఉండటంతో పాటు మరో కిడ్నీ కూడా దెబ్బతిన్నట్లు గుర్తించారు. పరిస్థితిని అంచనా వేసిన వైద్య బృందం తగిన చికిత్స అందించడంతో క్రమంగా కిడ్నీల పనితీరు మెరుగుపడి అంజయ్య కోలుకున్నారు. పూర్తిగా ఆరోగ్యం కుదుటపడటంతో శనివారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు.ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ తాను ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి వచ్చినప్పటికీ లిమ్స్ వైద్యులు, సిబ్బంది అందించిన ప్రత్యేక వైద్య సేవలతో తిరిగి ఆరోగ్యంగా కోలుకున్నానని తెలిపారు. తనకు మెరుగైన వైద్యం అందించి ప్రాణాలు కాపాడిన వైద్యులకు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా లిమ్స్ డాక్టర్ డాక్టర్ విజయేందర్ యురళజిస్ట్ మాట్లాడుతూ కిడ్నీల సమస్యలను ప్రజలు నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. అంజయ్య గతంలో డయాలసిస్ చేయించుకున్నప్పటికీ, సమస్యకు గల అసలు కారణాలను గుర్తించి అవసరమైన పరీక్షల అనంతరం తగిన చికిత్స అందించామని తెలిపారు. కిడ్నీల పనితీరు దెబ్బతిన్న ప్రతిసారీ డయాలసిస్ ఒక్కటే మార్గం కాదని, సమస్యను ముందుగానే గుర్తించి సరైన సమయంలో వైద్యులను సంప్రదిస్తే కొన్ని సందర్భాల్లో కిడ్నీల పనితీరును మెరుగుపరిచే అవకాశం ఉంటుందని వివరించారు. కిడ్నీ సంబంధిత లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు సూచించారు.



బొల్లారంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించిన ఇంఛార్జి డీసీ లలితా శ్రావణి

పటాన్ చెరు, నవంబర్ 7 (ప్రభాత ఉదయం):


అమీన్‌పూర్ మున్సిపల్ సర్కిల్ పరిధిలోని బొల్లారం డివిజన్‌లో శనివారం ఇంఛార్జి డిప్యూటీ కమిషనర్ (డీసీ) లలితా శ్రావణి క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారు. డివిజన్ పరిధిలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా గాంధీనగర్‌లోని డంపింగ్ యార్డును, స్థానిక స్మశాన వాటికను సందర్శించి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. చెత్త సేకరణ, తరలింపు ప్రక్రియ సక్రమంగా జరగాలని, ఎక్కడికక్కడ నిల్వ ఉన్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు సూచించారు.అనంతరం స్మశాన వాటికలో మౌలిక వసతులు, పరిశుభ్రతపై ఆరా తీసి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీ వెంట మున్సిపల్ అధికారులు, సానిటేషన్ డిఇ వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.



సైబర్ సిటీ విద్యుత్ కార్యాలయంలో ఘనంగా దీపావళి వేడుకలు

శ్రీ లక్ష్మీదేవి అమ్మవారి పూజలలో పాల్గొన్న డైరెక్టర్లు కృష్ణారెడ్డి, చక్రపాణి లు

మెహదీపట్నం, నవంబర్ 7(ప్రభాత ఉదయం)



మెహదీపట్నం నానల్ నగర్ చౌరస్తా లో విద్యుత్ సైబర్ సిటీ సర్కిల్ కార్యాలయంలో దీపావళి పండుగ పురస్కరించుకొని శ్రీ లక్ష్మీదేవి అమ్మవారి పూజలు ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సర్కిల్ ఎస్ ఏ ఓ ఎంపీ రవికుమార్,అకౌంట్స్ ఆఫీసర్ మురళి గౌడ్ నేతృత్వంలో జరిగిన శ్రీ లక్ష్మీదేవి అమ్మవారి పూజల్లో టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ లు కృష్ణారెడ్డి, చక్రపాణి లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు కృష్ణారెడ్డి, చక్రపాణిలు మాట్లాడుతూ... శ్రీ లక్ష్మీదేవి ఆశీస్సులతో విద్యుత్ వినియోగదారులు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. వినియోగదారులు సంస్థకు తోడ్పాటు అందించి సహకరించాలని కోరారు. ఈ పూజా కార్యక్రమంలో సీఈఎల్ గోపయ్య, ఎస్ ఈ లు చంద్రశేఖర్, రవి ప్రసాద్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ నాగార్జున రెడ్డి, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ కృష్ణయ్య, కాంట్రాక్టర్ వాసుదేవా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాగితాల్లోనే కోట్ల ప్రణాళిక

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 7 (ప్రభాత ఉదయం):



కరీంనగర్ శాతవాహన పట్టణాభివృద్ధిసంస్థ(సుడా), నగరపాలక సంస్థకు తయారు చేసిన కొత్త మాస్టర్‌ప్లాన్ అమల్లోకిరావడంలో మరింత ఆలస్య మవుతోంది. 2041 విజన్తో తయారు చేసిన ముసాయిదాబృహత్ ప్రణాళికను గతేడాది డిసెంబరు చివరివారం లో పురపాలక పట్టణాభివృద్ధిశాఖకు అధికారులు పంపించారు. అక్కడ దీన్ని పరిశీలించగా పలు అంశాలపైసందేహాలు రావడం , తిరిగి పంపించాలని పేర్కొనడం తో వెనక్కివచ్చి నట్లుతెలుస్తోంది.బృహత్తర ప్రణాళిక పూర్తి స్థాయిలో సిద్ధం చేసి ఉండగా గతం లోని అభ్యంతరాలుమరోసారి పరిశీలించి ఆమోదించి పంపించాల్సి ఉంటుంది. ఆ తర్వాత పురపాలకప్రభుత్వానికి పంపిస్తే ఆమోదించి గెజిట్తోపాటు ఉత్తర్వులు జారీ కానున్నాయి.అయితే నెలల తరబడి సుడా కార్యాలయం లో దస్త్రాలు ఉండగా పట్టించుకునే వారేలేకుండా పోతున్నారు. ఏడాది కిందట బృహత్తర ప్రణాళికపై 41 అభ్యం తరాలు వచ్చాయి. సుడాకార్యాలయంలో అప్ప టి ఛైర్మన్ కోమటిరెడ్డి నరేం దర్రెడ్డి, వైస్ ఛైర్మన్ ప్రఫుల్ దేశాయ్,పట్టణ ప్రణాళిక అధికారులు పరిశీలించి న్యాయబద్ధం గా ఉన్నవాటిని క్షేత్రస్థాయిలోతనిఖీ చేసి ఆమోదించారు. అత్యధికంగా నగరానికి సంబంధిం చినవి ఉండటం తోఆమోదితంగా ఉన్న వాటిని తనిఖీ చేశారు.సుడా ఏర్పాటు చేసిన తర్వాత పరిధి విస్తరించడం తో సరిహద్దులు మారాయి,మున్సిపాలిటీగా ఉన్న సమయంలో విలీనం చేసిన రాంపూర్, రాంనగర్ పంచాయతీలు, అయిదేళ్ల కిందట ఎనిమిది గ్రామాలు, రెండేళ్ల కిందట అయిదుగ్రామాలు, ఒక మున్సిపాలిటీ విలీనం చేశారు.పం చాయతీలతోపాటు నగరం లోని విలీన గ్రామాల్లో కొత్తగా నిర్మాణాలు చేసుకునేవారు పంచాయతీ ప్రణాళికలే అమలు చేస్తున్నా రు. దీంతో రహదారి విస్తరణకుఅడ్డంకులు రావడం , అనుమతుల ప్రకారంనిర్మించుకోవడంలేదు. ఇష్టానుసారంగాపనులు చేస్తుండటం తో భవిష్యత్తులో ఇబ్బం దులుఎదురయ్యే అవకాశముంటుంది.నగరం లో ప్రధాన రహదారుల వెంట ఉన్న కమర్షియల్, ప్రణాళికలుచేశారు.ప్రధాన రహదారులకు ఇరువైపులా, టవర్ సర్కిల్ ప్రాంతాన్ని కమర్షియల్ జోన్ గా గుర్తించనున్నారు.40 ఫీట్లకుపైబడిన వాటన్నిం టినీ మిక్స్ ల్యాండ్ కింద చూపించారు.విలీన గ్రామాల్లోని వ్య వసాయ భూములను సులువుగా నివాసిత ప్రాంతాలుగామార్చుకునే వీలు కల్పించారు.ఎఫ్ఏఎల్, బఫర్ జోన్లుగా సూచిస్తుం డగా ప్రస్తుతం నివాసిత ప్రాంతాలుగాఉన్నాయి. వీటికి భవన నిర్మాణ పర్మిషన్లు ఇచ్చేలా మార్పులు చేశారు.ఔటర్ రింగ్ రోడ్డు 200 ఫీట్ల వెడల్పు , 138 కిలోమీటర్ల పొడువునా నిర్మించాలని నిర్ణయించారు.వీధిరహదారులు 30, 60, 80, 100 ఫీట్లకు మారనున్నాయి.

నేడు చిన్నకంజర్లలో 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' వేడుకలు

ముఖ్య అతిథిగా హాజరుకానున్న మంత్రి వివేక్ వెంకటస్వామి: కాట శ్రీనివాస్ గౌడ్ వెల్లడి

పటాన్‌చెరు, నవంబర్ 7 (ప్రభాత ఉదయం):



పటాన్‌చెరు నియోజకవర్గం, ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని చిన్నకంజర్ల గ్రామంలో ఆదివారం నిర్వహించనున్న 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివారం ఉదయం 10:30 గంటలకు చిన్నకంజర్ల గ్రామంలో ఈ వేడుకలు ఘనంగా ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందనే సందేశంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ వేడుకను విజయవంతం చేయాలని ఆయన కోరారు. అలాగే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాట శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608